
సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



విద్యుత్ శాఖలో నకిలీలు
విద్యుత్ శాఖలో 1997లో కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణలో అవకతవకలు జరిగినట్టు విజిలెన్స్ అధికారులు తేల్చినా చర్యలు తీసుకోలేదు. IIలో ▸



సెంటిమెంట్ వైపే మొగ్గు
అక్షయ తృతీయ సెంటిమెంట్ పనిచేసింది. జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. IIలో ▸

వాట్సాప్ స్టేటస్ మార్చమన్నాడని..
సినీ హీరోలను ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకునే విషయమై ఇద్దరు పెయింటర్ల మధ్య జరిగిన వివాదం హత్యకు దారి తీసింది. IIలో



కంపెనీ భూములకు మోక్షం

దశాబ్దాల కల సాకారం
- సాగుదారులకే దర్బరేవు కంపెనీ భూములు
- నేడు రెవెన్యూ మంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీ
- 1,602 మంది రైతులకు 1,754 ఎకరాల భూమి అందజేత
- బ్రిటిష్ కాలం నాటి సమస్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కారం



నరసాపురం మండలంలో సాగులో ఉన్న దర్బరేవు కంపెనీ భూములు

నరసాపురం: నరసాపురం తీర గ్రామాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పేద రైతుల భూముల సమస్యకు మోక్షం లభించింది. బ్రిటిష్ హయాంలో లీజుకు తీసుకుని తరతరాలుగా అనుభవిస్తున్న భూములకు సాగు చేస్తున్న రైతులనే హక్కుదారులు చేసే బృహత్తర కార్యక్రమానికి గతేదాది నవంబర్‌లో సీఎం జగన్ లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు నరసాపురం మండలం దర్బరేవు గ్రామంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతులమీదుగా రైతులకు భూములను పంపిణీ చేయనున్నారు. దర్బరేవు కంపెనీ భూములను ప్రస్తుతం అనుభవిస్తున్న వారికే రూ.100 నామమాత్రపు కనీస ధరకు అప్పగించడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తోంది. ఈ మేరకు 1,754 ఎకరాల భూమిని 1,602 మంది రైతులకు పంపిణీ చేయనున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టాదారు పాసు పుస్తకాలతో సహా రైతులకు అందించనున్నారు.

కన్నేసిన టీడీపీ

2014లో టీడీపీ ప్రభుత్వం కంపెనీ భూములపై కన్నేసింది. రైతులకు భూములు అప్పగిస్తామని మభ్యపెట్టి కోట్లు దండుకుంది. 2019లో ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో నిబంధనలు పాటించకుండా అమలు సాధ్యం కాని జీఓ విడుదల చేసి కంపెనీ భూములకు పట్టాలిస్తామని రైతులను నమ్మబలికింది. ఎకరా రూ.1,000 ఇస్తామని చెప్పినా స్థానిక టీడీపీ నాయకులు రూ.20 వేల నుంచి రూ.50 వేల చొప్పున రైతుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మొండిచేయి చూపారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధిత రైతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును కలిసి మొరపెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే ముదునూరి విషయాన్ని ముఖ్యమంత్రికి తెలియజేసి సబ్‌కలెక్టర్‌తో విచారణ చేయించారు. అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ కావడంతో ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. ఇదిలా ఉండగానే ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి కృషితో జగన్ సర్కార్ అర్హులైన రైతులకు కంపెనీ భూములు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

సమగ్ర సర్వేతో అర్హుల గుర్తింపు

కంపెనీ భూములు సాగు చేసుకుంటున్న వారిలో అర్హులను సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వం గుర్తించి, రిజిస్ట్రేషన్లు చేయించడానికి ఉపక్రమించింది. భవిష్యత్‌లో రైతులకు న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా కేబినెట్ ఆమోదం చేయించి, పక్కాగా జీఓతో భూములను పంపిణీ చేస్తున్నారు.

కంపెనీ భూముల కథేంటంటే..

1921లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం దర్బరేవు చుట్టుపక్కల గ్రామాల్లోని 1,814 ఎకరాల భూమిని సాగు చేసుకునే నిమిత్తం పేదలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు రైతులు ది అగ్రికల్చర్ సొసైటీ కంపెనీ లిమిటెడ్ పేరుతో సంఘంగా ఏర్పడ్డారు. వీరికి 100 ఏళ్ల లీజు హక్కులు అప్పగిస్తూ 1921 జూలై 23న బ్రిటిష్ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. అప్పటి నుంచి వాటిని కంపెనీ భూములుగా పిలుస్తున్నారు. అయితే 1926లో బ్రిటిష్ ప్రభుత్వం సర్వే చేపట్టి కాలువలు, డ్రెయిన్ల నిమిత్తం 60 ఎకరాలను గుర్తించి రైతుల నుంచి తీసుకుంది. దీంతో 1,754 ఎకరాలు రైతుల చేతుల్లో ఉన్నాయి. అప్పట్లో ఈ భూములు వ్యవసాయయోగ్యంగా లేకపోగా రైతులు కష్టపడి తరతరాలుగా వ్యవసాయం చేసి సాగులోకి తీసుకువచ్చారు.

“ ముఖ్యమంత్రి చొరవతో..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కంపెనీ భూముల సమస్య పరిష్కారమైంది. దర్బరేవు కంపెనీ భూముల సమస్యపై సీఎం సానుకూలంగా స్పందించారు. సర్వేకు ఆదేశించడంతో పాటు రూ.100 కనీస ధరకు పొజిషన్‌లో ఉన్న సాగుదారులకు భూములు పంచాలని నిర్ణయించారు. సీఎం జగన్ నరసాపురం పర్యటనలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పుడు పక్కాగా ఆ భూములను జిరాయితీగా రిజిస్ట్రేషన్ చేయడం, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పట్టాదారు పాస్‌పుస్తకాలతో సహా అందిస్తాం. దీంతో ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పడుతుంది. రిజిస్ట్రేషన్ దస్తావేజులను రెవెన్యూ శాఖ మంత్రి చేతుల మీదుగా అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

40 వేల మందికి ఇంటర్న్‌షిప్



జగన్‌మోహన్‌రెడ్డి, నోడల్ అధికారి

పాలకొల్లు సెంట్రల్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల నుంచి 40 వేల మంది విద్యార్థులు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో పాల్గొన్నారని నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్, ఈసీ మెంబర్, ఇంటర్న్‌షిప్ నోడల్ అధికారి బి.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక చాంబర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేస్తున్నారన్నారు. దీనివల్ల విద్యార్థులకు పని అనుభవం పెరిగి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. గతంలో డిగ్రీ విద్యను మధ్యలో నిలుపుదల చేస్తే సర్టిఫికెట్ ఇచ్చేవారని కాదని, అయితే ప్రస్తుత విద్యా విధానంలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తయిన తర్వాత విద్యను నిలుపుదల చేయాలనుకునే విద్యార్థులకు సర్టిఫికెట్, రెండో సంవత్సరం పూర్తయితే డిప్లమో సర్టిఫికెట్ ఇస్తారన్నారు. మూడో సంవత్సరం పూర్తయిన విద్యార్థికి డిగ్రీ సర్టిఫికెట్, నాల్గో సంవత్సరం పూర్తి చేస్తే ఆనర్స్ డిగ్రీ సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఆనర్స్ చేసిన విద్యార్థి పోస్టు గ్రాడ్యుయేషన్ ఒక సంవత్సరం చదివితే సరిపోతుందన్నారు. ఇంటర్న్‌షిప్ ద్వారా దూరప్రాంతాల పరిశ్రమలకు వెళ్లలేని విద్యార్థులకు కళాశాలల్లోనే శిక్షణ ఇస్తామన్నారు. కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు, ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దే'దీప్య'మానం



ప్రత్యేక దీపాలంకరణలో స్వామి, అమ్మవార్లు

కాళ్ల: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ (ఊంజల్ సేవ) నేత్రపర్వంగా జరిగింది. ప్రత్యేక దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకటకృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారిని తాకిన సూర్య కిరణాలు



బాల వేంకటేశ్వరస్వామి

తణుకు టౌన్: తణుకు పైడిపర్రులోని శ్రీదేవి, భూదేవి సమేత బాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఏటా ఏప్రిల్ 20, 21, 22 తేదీల్లో స్వామివారిపై సూర్యకిరణాలు ప్రసరిస్తాయని, అలాగే శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో స్వామి పాదాలను సూర్యకిరణాలు తాకినట్టు భక్తులు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఇంటి ముంగిట మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్వో కె.కృష్ణవేణి, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి అన్నారు. శనివారం ధరిత్రి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని చినరంగనిపాలెం మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో రాయిస్ యువర్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, స్కూల్ హెచ్ఎం కె.వెంకట్రావు, శ్రీకాంత్, ఏఎంఓ శ్రీమన్నారాయణ, సీఎంఓ రామకోటేశ్వరరావు, మల్లుల శ్రీనివాస్, చెల్లబోయిన సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సాగరం



అనివేటి మండప ప్రాంతంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శనివారం, ఇటీవల పదో తరగతి పరీక్షలు ముగియడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. వేకువజాము నుంచి భక్తుల తాకిడి కనిపించింది. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, అనివేటి మండప ప్రాంతంతో పాటు కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. సుమారు 30 వేల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించినట్టు ఆలయ వర్గాలు చెబుతున్నాయి. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

• ఈద్ ముబారక్



జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి దీక్షలను విరమించారు. శనివారం భీమవరం పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింల దృశ్యమిది.
– భీమవరం (ప్రకాశంచౌక్)

ధాన్యం కొనుగోలు నిబంధనల సవరణ

ఏలూరు(మెట్రో): రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల విజ్ఞప్తి మేరకు కొన్ని నిబంధనలు సవరించినట్టు ఏలూరు ఆర్డీఓ కె.పెంచల కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉంగుటూరు మండలం నారాయణపురం, చేబ్రోలు గ్రామాల్లో రైతులు మాసూళ్లు చేసి ధాన్యం ఎగుమతి చేస్తున్న కళ్లాల వద్దకు వెళ్లి ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరాకు 92 నుంచి 100 సంచులకు పెంచి కొనుగోలుకు అనుమతించిందని, గతంలో ఎగుమతి చేసిన రైతులు మిగిలిన 8 సంచుల ధాన్యం ఇప్పుడు విక్రయించేందుకు అవకాశం ఉందన్నారు. అనంతరం ఉంగుటూరు ఆర్‌బీకేను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమణారావు, వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు, డీసీఎంస్ మార్కెటింగ్ ఇన్‌చార్జి సంతోష్, కో–ఆపరేటివ్ సొసైటీలతో సమీక్షించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మైనార్టీలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ముస్లింలకు రంజాన్ కానుక అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: రాష్ట్రంలో మైనార్టీలకు అండగా నిలిచింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కటేనని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక కొమ్మాయిచెర్వు ప్రాంతంలోని ఈద్గాలో ముస్లింలు నిర్వహించిన రంజాన్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి చొరవతో మైనార్టీలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించారని అదే స్ఫూర్తితో ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు పన్నినా మైనార్టీలంతా సీఎం జగన్ వెంటే నడుస్తున్నారని స్పష్టం చేశారు. నామినేటెడ్ పదవుల్లో సైతం మైనార్టీలను అందలమెక్కించిన చరిత్ర సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా మసీదు ఇమామ్‌లు, ముస్లింలకు మంత్రి కారుమూరి రంజాన్ కానుక అందజేశారు. యువనేత కారుమూరి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కీచక ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

'సాక్షి' వార్తపై స్పందించిన సీఈఓ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాపరిషత్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ సెక్షన్‌లో రికార్డు అసిస్టెంట్ అయిన మహిళా ఉద్యోగిని వేధించిన ఘటనలో అసభ్యకరంగా ప్రవర్తించిన సీనియర్ అసిస్టెంట్ వీరవల్లి విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లాపరిషత్ సీఈఓ. రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాపరిషత్‌లో కీచకపర్వంపై 'సాక్షి'లో వచ్చిన వార్తపై స్పందించిన సీఈఓ ముగ్గురు మహిళా ఉద్యోగులతో విచారణకు ఆదేశించారు. విచారించిన మహిళా బృందం సంఘటన వాస్తవం అని తేల్చింది. అలాగే ఆ శాఖ ఈఈ, డీఈలు సైతం ఘటన వాస్తవమని నివేదిక ఇవ్వడంతో జిల్లాపరిషత్ సీఈఓ చర్యలకు ఉపక్రమించారు. దీంతో విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఘటనను వెలుగులోకి తీసుకువచ్చిన 'సాక్షి'కి జిల్లాపరిషత్ మహిళా సిబ్బంది, సీఈఓ అభినందనలు తెలిపారు.

24 నుంచి పాలకొల్లు రైల్వేగేటు మూసివేత

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులోని రైల్వేగేటు వద్ద మరమ్మతులు చేస్తున్న కారణంగా ఈనెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ రైల్వేగేటు మూసివేస్తున్నట్టు స్టేషన్ మాస్టర్ టి.రామలింగేశ్వరరావు తెలిపారు. వాహనదారులు పోలీస్ అధికారులు సూచించిన ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని కోరారు.

సెంటిమెంట్ వైపే మొగ్గు

- అక్షయ తృతీయ రోజు అమ్మకాలు అదుర్స్
- ఉమ్మడి జిల్లాలో కళకళలాడుతున్న జ్యూయలరీ షాపులు
- రూ.8 కోట్ల వరకు బంగారం అమ్మకాలు



నరసాపురంలో కొనుగోలుదారులతో కళకళలాడుతున్న ఓ జ్యూయలరీ షాపు

నరసాపురం: అక్షయ తృతీయ సెంటిమెంట్ వర్కవుట్ అయ్యింది. శనివారం అక్షయ తృతీయ పర్వదినం రోజున ఉదయం నుంచే బంగారం షాపులు కొనుగోలుదారులతో కళకళలాడాయి. రాత్రి 9 గంటలైనా జ్యూయలరీ షాపులు రద్దీగానే ఉన్నాయి. నెల నుంచి పరుగులు పెట్టిన బంగారం ధరలు యాదృచ్ఛికంగా అక్షయ తృతీయ రోజునే స్వల్పంగా తగ్గాయి. శనివారం కాసు ధర రూ.300 తగ్గింది. దీనికి తోడు మరోవారం రోజుల్లో మూఢం వెళ్లిపోయి, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండటం కూడా అక్షయ తృతీయ అమ్మకాలకు కలిసొచ్చింది. చాలాకాలంగా బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకుంటూ వస్తున్న వారు అక్షయ తృతీయ రోజు బంగారం కొనడానికి మొగ్గుచూపారు. దీంతో అమ్మకాలు జోరుగా సాగాయి. గత నాలుగేళ్లలో అక్షయ తృతీయ రోజు ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 2020, 2012 సంవత్సరాలలో కరోనా ప్రభావంతో అమ్మకాలు అంతగా సాగలేదు. గత ఏడాది కొంతమేర పుంజుకుంది. ఈ ఏడాది ధరలు పెరిగినా కూడా జిల్లాలో రికార్డు స్థాయిలో బంగారం అమ్మకాలు సాగాయని బులియన్ వర్గాలు చెబుతున్నాయి. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు ముఖ్య పట్టణాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆభరణాలు, బిస్కెట్ కలిపి రూ.8 కోట్లు వరకు అమ్మకాలు జరిగినట్లు అంచనా.

ఉమ్మడి పశ్చిమలో సంవత్సరాల వారీగా అక్షయ తృతీయ రోజు బంగారం అమ్మకాలు ఇలా..

సంవత్సరం	మొత్తం (రూ.కోట్లలో)		
		2020	30
		2021	2
2218	5	2022	6
2019	7	2023	8

అనుమానాస్పద స్థితిలో కొరియర్ బాయ్ మృతి




శివదుర్గ ప్రసాద్ (ఫైల్)

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెంకు చెందిన దివ్యాంగుడైన ఓ కొరియర్ బాయ్ ఈ నెల 18న అదృశ్యం కాగా, శనివారం గ్రామం శివారులో ఉన్న ఓ కొబ్బరితోటలో చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దివ్యాంగుడైన నాయుడు శివదుర్గ ప్రసాద్ (26) ద్వారకాతిరుమలలోని ఈ-కార్ట్‌లో కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 18న శివదుర్గ ప్రసాద్ అదృశ్యం కాగా, సోదరుడి ఫిర్యాదు మేరకు ఈ నెల 19న మిస్సింగ్ కేసు నమోదైంది. ఇదిలా ఉంటే తిరుమలంపాలెం శివారులోని ఒక కోకో, కొబ్బరి తోటలోకి శనివారం పనులకు వెళ్లిన కూలీలకు ఓ మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై టి.సుధీర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ప్రసాద్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించారు. క్రికెట్ బెట్టింగ్‌ల కారణంగా శివదుర్గ ప్రసాద్ అప్పులపాలై ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు.

విద్యుత్ శాఖలో నకిలీలు

విద్యుత్ శాఖలో 1997 సంవత్సరంలో చేపట్టిన కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణలో అవకతవకలు జరిగి పాతికేళ్లుగా అనర్హులు ఉద్యోగులుగా చెలామణి అవుతున్నారు. ఈ విషయాన్ని అదే శాఖలోని విజిలెన్స్ అధికారులు విచారణ చేసి తేల్చినా దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. ఇవే అర్హతలు ఉన్నా తమకు ఉద్యోగం దక్కలేదని కొందరు కోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చినా అమలుకు నోచుకోలేదు. టీడీపీ ప్రభుత్వంలో ఈ వ్యవహారం జరగగా, సుమారు వంద మంది బాధితులు న్యాయం కోరుతూ ఇప్పటికీ విశాఖపట్టణంలోని ప్రధాన కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.

- అనర్హులైనా ఉద్యోగులుగా చలామణి
- విచారణలో నిగ్గుతేలినా పట్టని వైనం
- పాతికేళ్లుగా పోరాటం చేస్తున్న అర్హులు
- గత టీడీపీ ప్రభుత్వంలోనే వ్యవహారం



తణుకు: తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) పశ్చిమగోదావరి జిల్లా ఆపరేషన్ సర్కిల్ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారి సర్వీసులను ఎల్‌డీసీ, టైపిస్టు, సబ్‌ఇంజినీర్‌గా క్రమబద్ధీకరించాలని అప్పటి విద్యుత్ బోర్డు బీపీ/36 సర్క్యులర్ నంబర్‌తో నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం క్యాజువల్ లేబర్‌ను క్రమబద్ధీకరించాలని ఉత్తర్వులు ఉన్నాయి. అయితే జిల్లాలో ఉన్న ఖాళీల్లో 50 శాతం మేర భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ పోస్టులను భర్తీ కోసం 1997 మే 18న నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 520 మంది ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలు పూర్తి చేసి రెండు దఫాలుగా 1999, 2003లో అర్హులను ప్రకటించారు. వీరిలో 199 మంది జూనియర్ లైన్‌మేన్లు, ఎల్‌డీసీలు, సబ్‌ఇంజినీర్లు ఉన్నారు. మిగిలిన వారికి ఉద్యోగాలు ఇవ్వలేమంటూ అధికారులు చేతులెత్తేశారు. అయితే ఉద్యోగాలు పొందిన వారికి ఉన్న అర్హతలే తమకూ ఉన్నాయంటూ అనర్హులుగా అధికారులు తేల్చి చెప్పిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారికి అనుకూలంగా తీర్పు వచ్చినా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు.

కాసుల కోసం కక్కుర్తి

కేవలం కాసుల కోసం కక్కుర్తిపడి దిగువ స్థాయి సిబ్బంది నిర్వాకంతోనే అడ్డదారిలో ఉద్యోగాల భర్తీకి తెరలేచిందని తెలుస్తోంది. ఒక ఉద్యోగి సమీప బంధువులైన ఇద్దరు మహిళలకు ఏ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారనే ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. అయితే అప్పటి కొందరు అభ్యర్థులు పోరాడుతుండటంతో 2015లో అప్పటి సీఎండీ ముత్యాలరాజు విచారణకు ఆదేశించగా, ఉద్యోగాలు పొందిన వారిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 31 మంది అనర్హులు ఉన్నారని జేఎండీ విజిలెన్స్ ఇచ్చిన నివేదికలో తేల్చారు. వీరిలో నకిలీ విద్యార్హత, సర్వీసు సర్టిఫికెట్లు సమర్పించినవారు ఉన్నారని, అంతేకాక ఒకరి సర్టిఫికెట్లపై మరొకరు ఉద్యోగాలు చేస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది.

ఒకరి సర్టిఫికెట్లతో మరొకరు ఉద్యోగం

న్యాయస్థానం ఆదేశాల మేరకు విశాఖపట్టణంలోని విచారణ విభాగం డీఈ కె.కృష్ణమోహన్ విచారణ చేశారు. ఉద్యోగాలు పొందిన ముగ్గురు ఒకే సమయంలో ఇద్దరు కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్నట్లుగా ధ్రువీకరణ పత్రాలు జతచేయడం అనర్హతగా తేల్చారు.. అంతేకాకుండా ఒకరి సర్టిఫికెట్‌పై మరొకరు ఉద్యోగం పొందారు. ఈ క్రమంలో సదరు వ్యక్తి మృతి చెందడంతో అసలు వ్యక్తి పేరుతో డెత్ సర్టిఫికెట్ వచ్చింది. ఆ వ్యక్తి భౌతికంగా ఉన్నా రికార్డుల్లో చనిపోయినట్లు ఉండటంతో మరో వ్యక్తి సర్టిఫికెట్‌తో సదరు వ్యక్తి ఉద్యోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారం ఇటీవల వెలుగు చూడటంతో సదరు వ్యక్తిని సస్పెండ్ చేశారు. అయితే అతని డెత్ సర్టిఫికెట్‌ను ఆ శాఖలోని ఉద్యోగులే మాయం చేయడం గమనార్హం. అంతేకాకుండా మరో ముగ్గురు అక్రమంగా ఉద్యోగాలు చేస్తున్నట్లు నిర్ధారించారు. వీరికి సంస్థ ఉద్యోగులు కొందరు నిబంధనలు అతిక్రమించి సహకరించినట్లు తేల్చారు. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అయితే అర్హత ఉండి సర్టిఫికెట్లు అందజేసిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మొండిచేయి చూపారు.

పాతికేళ్లుగా పోరాడుతున్నాం



అప్పట్లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించా. విద్యుత్ బోర్డు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారితో పాటు అదే సమయంలో అర్హత ఉండి ఉద్యోగాలు నిరాకరించిన వారిని బహిరంగ విచారణ చేపట్టాలి. పాతికేళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే మాకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం.

– గోకవరపు శ్రీను, భీమవరం

విచారణలో తేలినా చర్యలు లేవు



నకిలీ విద్యార్హత, సర్వీసు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై మరోసారి విచారణ చేపట్టాలి. గతంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేసి అనర్హులకు ఉద్యోగాలు వచ్చిన మాట వాస్తవమేనని తేల్చారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టాలి.

– అక్కిపల్లి శ్రీనివాసరావు, ఏలూరు

అవకతవకలపై తెలిసింది

విద్యుత్ శాఖలో నకిలీ ఉద్యోగుల వ్యవహారంపై పూర్తి స్థాయిలో నా దృష్టికి రాలేదు. ఐదు నెలల క్రితమే ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాను. ఒకసారి మాత్రం కార్పొరేట్ కార్యాలయం నుంచి వివరాలు అడిగారు. గత ఏడాది మార్చిలో జరిగిన పరిణామాలు అనంతరం వ్యవహారం అలాగే ఉందని సమాచారం. గతంలో కొన్ని అవకతవకలు జరిగినట్లుగా తెలిసింది.

– పి.సాల్మన్‌రాజు, ఎస్ఈ ఆపరేషన్ సర్కిల్, ఏలూరు

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: కొమ్ముగూడెంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్.మూర్తి శనివారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఓ ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.2.27 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



వెంకటేష్ మృతదేహం

కొయ్యలగూడెం: విద్యుత్ షాక్‌కు గురై కారు సర్వీసింగ్ సెంటర్ లీజు దారుడు మృతి చెందాడు. ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెంకు చెందిన బండారు వెంకటేష్ (30) గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఇండియన్ ఆయిల్ బంకు వెనుక ఉన్న కారు సర్వీసింగ్ సెంటర్‌ను లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం కార్ వాష్ చేస్తుండగా, నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ పంపు మరమ్మతులకు గురైందేమోననే అనుమానంతో దానిని కదిపే ప్రయత్నం చేయగా, వెంటనే విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అక్కడి సిబ్బంది అతనిని ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పోలవరం రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను బలవంతంగా పెళ్లి చేసుకుని, అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ శనివారం చెప్పారు. పి.అయ్యప్ప అనే యువకుడు బాలికను బలవంతంగా పెళ్లి చేసుకుని అనంతరం పలు గ్రామాల్లో ఆమెను నిర్బంధించాడు. ఈ క్రమంలో బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక అతడి చెర నుంచి తప్పించుకుని బంధువులకు సమాచారం ఇవ్వగా వారు ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం బాలిక పోలీసులను ఆశ్రయించగా, డీఎస్పీ కె.లతాకుమారి ఆదేశాల మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడపగడపకు సంక్షేమం



పాలకోడేరు: కుముదవల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పేదలకు స్థలాలిస్తే అడ్డుకోవడం దుర్మార్గం

అమరావతి రైతుల ముసుగులో బాబు అండ్ కో, కులవాదులు



చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీటీసీ): అమరావతిలో పేదవాడికి జానెడు జాగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుని చదును చేస్తుంటే, రైతుల ముసుగులో బాబు అండ్ కో, కులవాదులు అడ్డుకోవడం దుర్మార్గమని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు ధ్వజమెత్తారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని సీఆర్డీఏ చట్టంలో పొందుపరిచిన విధంగానే ఐదు శాతం భూమిని పేదలకు కేటాయిస్తుంటే అడ్డుకునే హక్కు కులవాదులకు ఎవరిచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వానికి భూమిలిచ్చేసిన తరువాత రైతులకు వాటిపై అధికారం ఎలా ఉంటుందో చెప్పాలన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిట్ యాక్ట్ తరహాలో కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తుంటే కులవాదులు అడుగడుగునా అడ్డుతగలడం సిగ్గుచేటన్నారు.

ఎన్నికల్లో చంద్రబాబు ఫ్యాంటు, చొక్కా విప్పటానికి ప్రజలు సిద్ధం

యర్రగొండపాలెంలో విద్యా శాఖ మంత్రి ఆదిమూలం సురేష్‌ను టీడీపీ నాయకులు నెట్టేసి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేస్తుంటే మంత్రి షర్ట్ విప్పి నిరసన వ్యక్తం చేస్తే తప్పా అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఫ్యాంటు, చొక్కా విప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఒంటరిగా పోటీ చేస్తుందని సీఎం వైఎస్ జగన్ ప్రకటించారని, సర్వేలు కూడా ఇప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్ సీపీ అన్ని స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం చెబుతున్నాయన్నారు. శ్రీను, అచ్చిబాబు, బాబ్జి, ఆనంద్ పాల్గొన్నారు.

హీరో వాట్సాప్ స్టేటస్ మార్చమన్నాడని..

అత్తిలిలో పెయింటర్ హత్య



కిశోర్ మృతదేహం

అత్తిలి: సినీ హీరోలను ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకునే విషయమై ఇద్దరు పెయింటర్ల మధ్య జరిగిన వివాదం హత్యకు దారి తీసింది. తణుకు సీఐ సీహెచ్ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన హరికుమార్, కిశోర్ పెయింటర్లు. మూడు రోజుల క్రితం వీరు అత్తిలి మసీదు వీధిలో నజీర్‌కు చెందిన కొత్త ఇంటికి రంగులు వేసే పనుల నిమిత్తం వచ్చారు. పనులు చేసుకుంటూ ఇక్కడే నిద్రిస్తున్నారు. హరికుమార్ హీరో ప్రభాస్ అభిమాని. ఏలూరు ప్రభాస్ అభిమాన సంఘానికి కార్యదర్శిగా కూడా ఉన్నాడు. శుక్రవారం రాత్రి తన ఫోన్ వాట్సాప్‌లో ప్రభాస్ వీడియోను స్టేటస్‌గా పెట్టుకున్నాడు. కిశోర్ పవన్‌కల్యాణ్ అభిమాని కావడంతో పవన్ కల్యాణ్‌ను స్టేటస్‌గా పెట్టుకోవాలని హరికుమార్‌ను కోరాడు. దీంతో వీరిద్దరి మధ్య వివాదం రేగింది. దీంతో క్షణికావేశంలో హరికుమార్ సెంట్రింగ్ కర్రతో కిశోర్ తలపై బలంగా కొట్టి అక్కడే ఉన్న సిమెంటు రాయితో ముఖంపై బాదడంతో కిశోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన విషయాన్ని తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, నర్సాపురం డీఎస్పీ రవిమనోహరాచారి, తణుకు సీఐ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు హరికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎస్సై కేసీహెచ్ స్వామి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కిశోర్ భార్యతో విడాకులు తీసుకున్నాడని, ఒక కుమారుడు ఉన్నాడని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

జగనన్నతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్



పెంటపాడు గ్రామంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి తదితరులు

పెంటపాడు: జగనన్న పాలనతో పేదల కుటుంబాలలో వెలుగుతో పాటు, రాష్ట్రానికి బంగారు భవిష్యత్ ఏర్పడుతుందని పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబులు పేర్కొన్నారు. పెంటపాడు గ్రామంలో ఇంటింటికి మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాల్లో భాగంగా ఐదవ రోజైన శనివారం పలువార్డుల్లో ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో 8,9,10 వార్డుల్లో ప్రచారాలు ముగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, నాయకులు సత్తి ముత్యప్రసాద్‌రెడ్డి, తాడేపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చనున్న చలివేంద్రాలు



తణుకులో వృద్ధురాలికి మజ్జిగ పోస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వేసవి మండుటెండల్లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకే మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేల్పూరు రోడ్డులోని ఇ మాక్స్ థియేటర్ ప్రాంతాల్లో కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు మజ్జిగ చలివేంద్రాలను మంత్రి కారుమూరి, యువనేత కారుమూరి సునీల్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, కుడుపూడి చంద్రరావు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపకరిస్తాయని వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో చిటకన కృష్ణ, మర్లపాటి వెంకటరత్నం ,వీరమల్ల సుబ్రహ్మణ్యం, అవిశెట్టి ఆనందరావు, సాదే ప్రసాద్, మర్లపాటి రంగబాబు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్టేషన్ రోడ్డులో ఏఎఫ్‌బీ పాయింట్ అధినేత లయన్ డి.సుశీల ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ కమల ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో లియో క్లబ్ ప్రెసిడెంట్ మాధురి, సంపత్, అంబికా, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజమే ప్రపంచానికి ప్రత్యామ్నాయం

సాక్షి, భీమవరం: కమ్యూనిజమే ప్రపంచానికి ప్రత్యామ్నాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. శనివారం లెనిన్ జయంతి సందర్భంగా పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ప్రపంచ కార్మిక వర్గ మహానేత, కమ్యూనిస్టు సిద్ధాంత కర్త, సోవియట్ రాజ్య నిర్మాత లెనిన్ కమ్యూనిస్టులకు, ప్రగతిశీల శక్తులకు చాలా సుపరిచితమైన వ్యక్తి అన్నారు. ప్రపంచంలో తొలి కార్మిక రాజ్యాన్ని నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. జిల్లా కార్యదర్శి బి బలరాం, జేఎన్‌వీ గోపాలన్, చింతకాయల బాబురావు, పీవీ ప్రతాప్, కర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కాళ్ల: గృహిణిని వేధిస్తున్న ఘటనపై కాళ్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామానికి చెందిన మహాలక్ష్మికి పెన్మెత్స బాపిరాజుతో 2012లో వివాహం జరిగింది. అప్పట్లో ఆమె కట్నం కింద రూ.10 లక్షలు, మరో రూ.7 లక్షలు ఆడపడుచు కట్నం, సారె సామానం కూడా ఇచ్చారు. తాగుడు, జూదం, వ్యభిచారం వంటి దురలవాటులకు బానిసైన బాపిరాజు వైవాహిక జీవనంలో కలహాలు రేగాయి. ఈ తరుణంలో భార్య మహాలక్ష్మిని మానసికంగా, శారీరకంగా కొట్టి వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనికి ఆడపడుచు, ఆమె భర్త, బావ సహకరిస్తున్నారని మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

గ్రామదేవతలకు సారె సమర్పణ

కాళ్ల: స్థానిక గ్రామ దేవతలు మహంకాళమ్మ, వెంకమ్మవార్ల జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్లకు 400 కిలోలతో తయారు చేయించిన పలు రకాల స్వీట్లు, పండ్లు పసుపు, కుంకుమ, గాజులతో సుమారు 200 మంది మహిళలు సారె బిందెలు, కావిళ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవార్లకు సారె సమర్పించారు.

ఈ రంగు.. వట్టి హంగు

- మామిడిపండ్ల పక్వానికి రసాయనాల వినియోగం
- కొన్ని చోట్ల జోరుగా విక్రయాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రసాల రకం మామిడి పండ్లు



మార్కెట్‌లో బంగినపల్లి రకాల మామిడి పండ్లు

పెంటపాడు: పండ్లలో రారాజు మామిడి. సంపన్నులైనా, సామాన్యులైనా మామిడి రుచి అస్వాదించాల్సిందే. ఇలా అందరికీ పసందైన మామిడి వేసవి కాలంలో ప్రారంభం కావడంతో మార్కెట్‌లోకి వస్తోంది. అయితే కొన్ని చోట్ల పండ్లను పరిశీలిస్తే పైన పటారం. లోన లోటారం అన్న చందంగా ఉన్నాయి. గాలికి రాలిన కాయలను వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైట్‌ను ఉపయోగించి మాగించి తెస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆరోగ్యానికి హానీ కలిగించే ఈ కాల్షియం కార్బైట్ వినియోగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012లో నిషేధించింది. ఆరోగ్యకర పద్ధతులలో సహజత్వానికి దగ్గరగా మాగించాలని సూచించింది.

పండ్లు మాగే విధానం

సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తి అయ్యే ఇథిలిన్‌తో మాగుతాయి. ఇథిలిన్ పండు పక్వానికి వచ్చినప్పుడు దాని నిర్మాణం రంగు, రుచి వంటి మార్పులకు ఉపయోగపడుతుంది.

ప్రత్యామ్నాయ రసాయనాలు

తప్పని పరిస్థితిలో కాయలను మాగబెట్టేందుకు వినియోగదారుకు హానీ కలిగించని ఇథిలిన్ వాయువు 100 పీపీఎం మాత్రమే వినియోగించాలి. దీనిని 24 గంటల పాటు తగిలేటట్టు ఉంచితే ఐదు రోజుల్లో సహజత్వానికి దగ్గరగా, ఎలాంటి హాని లేకుండా కూడా మాగించవచ్చు. మామిడిని కోత అనంతరం 10 లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిల్ కలిపి అందులో మంచిగా ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా మాగుతాయి. వరిగడ్డి కింద మామిడిని మాగించడం మరింత సురక్షితం. ఇంటిలో కాయలను మాగబెట్టాలనుకొంటే కొన్ని మాగని కాయలను మరికొన్ని మాగిన పండ్లను గాలి చొరబడని డబ్బాలో ఉంచాలి. పక్వానికి వచ్చిన కాయలను ఒక రూములో వరిగడ్డి లేదా, బోదగడ్డిలో ఉంచితే సహజసిద్ధంగా మాగుతాయి.

తేడాలివే:

సహజంగా మాగిన పండురంగు కొంత పసుపు, మరి కొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలిభాగం అంతా పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా మాగిన వాటిలో పండ్లు మొత్తం ఒకే విధంగా కాంతివంతమైన లేత పసుపు కలిగి కలిగి ఉంటాయి. పైకి మాగినట్లు కనిపించినా, లోపల అపరపక్వంగా ఉండి రుచిలో పుల్లగా ఉంటాయి. సహజంగా మాగిన పండు నుంచి వచ్చే కమ్మని వాసన మనం దూరంగా ఉండగానే తెలుస్తుంది. కృత్రిమంగా మాగిన పండును పరిశీలిస్తే ముక్కుకు దగ్గరగా ఉంచినపుడు మాత్రమే వాసన వస్తుంది. సహజంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడుతుంది. దీంతో తియ్యగా, రుచిగా ఉంటుంది. కృత్రిమంగా మాగిన పండులో తగినంత చక్కెరశాతం ఏర్పడక తక్కువ తీపిదనం, రుచి లేకుండా ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

సీజన్ రాకముందే కృత్రిమంగా మాగబెట్టిన రంగు వచ్చేటట్లు చేసిన పండ్లు కొనరాదు. రంగు చూసి మోసపోరాదు. ఇలాంటి పండు ఆరోగ్యానికి మంచిదికాదు. పండ్లు పరిపక్వత చెంది సహజంగా మాగిన పండ్లను తీసుకోవాలి. మామిడి పండు తయారైనా రంగు, వాసన బట్టి పలు రకాల మామిడి కాయలు కొనుగోలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది ఆరోగ్యదాయకం. పండ్లను ముందుగా ఉప్పు కలిపిన నీటిలో 15 నుంచి 20 నిముషాలు ఉంచాలి. తిరిగి వాటిని మంచినీటిలో కడగాలి. తర్వాత తడిలేకుండా తుడిచి తినాలి. సాధ్యమైనంత వరకు పండ్ల తొక్కను తీసి తినడం మంచిది.

దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్ : తెదేపా అధినేత చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపని దళితుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన తెదేపా నాయకులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్ తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో శనివారం ముప్పిడి సంపత్ కుమార్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సమావేశాల్లో చంద్రబాబు నాయుడు దళిత కులంలో ఎవరైనా పుట్టాలనుకుంటారా అంటూ పలు విధాలుగా దళితుల మనోభావాలకు భంగం కలిగేలా మాట్లాడారన్నారు. వైఎస్సార్ సీపీ మంత్రి ఆదిమూలపు సురేష్ నియోజకవర్గంలో చంద్రబాబు వాఖ్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు, సభ్యులపై తెదేపా నాయకులు అమానుషంగా దాడులు చేసి తీవ్ర గాయాల పాలు చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు సముచిత స్థానం కల్పించి గుర్తింపునిచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా దళితులకు ఉన్నత పదవులు కల్పించి గౌరవాన్ని పెంచారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత వర్గీయులందరూ వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేసి తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ పొట్ల ఏడుకొండలు, దండే చినగోపయ్య, మండా శివరామకృష్ణ, మార్లపూడి సుబ్బారావు, రాపాక వెంకటేశ్వరరావు, దేవాబత్తుల బాబి, రామగాని శ్రీనివాసు, ఎంపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో నానా అవస్థలు పడిన ఆవు



ఆవు గిత్తను బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని తాలూకా ఆఫీస్ సెంటర్ కోర్టు సముదాయం వద్ద రాళ్ల మూత లేని మురుగు బోదెలో శుక్రవారం సాయంత్రం ఆవు గిత్త పడిపోయింది. రాత్రి సమయం అంతా ఆ మూగజీవి నానా అవస్థలు పడింది. శనివారం ఉదయం స్థానికులు గుర్తించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది, స్థానికులు సంయుక్తంగా ఆవు గిత్తను బయటకు తీసి కాపాడారు. గతంలో ఈ రాళ్ల మూత లేని బోదె ప్రాంతంలో చాలా మూగ జీవులు పడిపోయి, ఇబ్బందులు పడ్డాయని, పురపాలక సంఘం అధికారులు తక్షణమే స్పందించి తక్షణమే డ్రైన్ పై రాళ్ల ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



తణుకు ఈద్గాలో నమాజ్‌కు హాజరైన ముస్లిం సోదరులు



అత్తిలి ఈద్గా వద్ద ప్రార్థనలలో పాల్గొన్న ముస్లింలు



తాడేపల్లిగూడెం పెద్ద మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కె. పెంటపాడులో ఈద్గా వద్ద నమాజు చేస్తున్న ముస్లీం సోదరులు

తణుకు అర్బన్: రంజాన్ సందర్భంగా తణుకులోని ఈద్గాకు శనివారం వందల సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌లు చేసుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. మసీదు ఇమామ్‌లు, ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ముస్లిం సోదర సోదరీమణులంతా పేదవారికి సాయపడుతూ సమాజ సేవకు కట్టుబడి ఉందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, డాక్టర్ హుస్సేన్ అహ్మద్, షేక్ బాజీ, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక గ్రామాల్లోని మసీదులలో ముస్లీంలు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయా మసీదులకు చెందిన మత పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని రేలంగి, తూర్పువిప్పర్రు గ్రామాల్లో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం ఉదయాన్నే చిన్నారులు పెద్దలు నూతన వస్త్రాలు దరించి, బంధువులతో కలిసి అల్లాను స్మరిస్తూ ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ పండుగ విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. 30 రోజుల ఉపవాస దీక్షను ముగించుకుని, పండుగను సంతోషంగా నిర్వహిస్తున్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఆత్మీయ ఆలింగనం చేసుకుని స్వీట్లు తినిపించుకున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నియోజక వర్గంలోని ముస్లిం సోదరులకు రంజాన్ కానుక అందించడంతో ఎంతో సంతోషంగా జరుపుకుంటున్నామని ముస్లిం సోదరులు తెలిపారు.

అత్తిలి: అత్తిలిలో రంజాన్ పండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం ఉదయాన్నే చిన్నారులు పెద్దలు నూతన వస్త్రాలు దరించి, బంధువులతో కలిసి అల్లాను స్మరిస్తూ ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ పండుగ విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. 30 రోజుల ఉపవాస దీక్షను ముగించుకుని, పండుగను సంతోషంగా నిర్వహిస్తున్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఆత్మీయ ఆలింగనం చేసుకుని స్వీట్లు తినిపించుకున్నారు. అత్తిలి మండలంలో ముస్లింలందరికీ రంజాన్ తోఫా అందజేసిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మసీదు సెక్రటరీ ఖాజావలీ, అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం ఉదయాన్నే చిన్నారులు పెద్దలు నూతన వస్త్రాలు దరించి, బంధువులతో కలిసి అల్లాను స్మరిస్తూ ప్రార్థనలు చేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ రఫాత్, కార్యదర్శి సర్దార్ ఖాన్, జలాలుద్దీన్, షేక్ వలీ, సర్తాజ్, యండి.రఫీ, రిజ్వాన్, మసీద్ పెద్దలు మహబూబ్ భాష, బాబార్, ఆటో వలీ, షకీల్, ముస్లిం యువత, చిన్నారులు పాల్గొన్నారు.

పెంటపాడు: రంజాన్ పండుగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.శనివారం ఉదయం పెంటపాడు, కె. పెంటపాడు, మీనవల్లూరు, వల్లూరపల్లి, తదితర గ్రామాలలో మసీదు వద్ద ముస్లీం సోదరులు ప్రత్యేక నమాజు కార్యక్రమాలు నిర్వహించారు.

రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలి



లింగారాయుడిగూడెం గ్రామంలో కూలీలతో మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: రెండు పూటలా పనివిధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని లింగారాయుడిగూడెం, ఇటుకులగుంట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సోమరాజు కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే కూలీలు ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాగంటి రమణ, పాశం చిన్న, పెద్దిరాజు, పాలుపూరి సూర్యారావు, సుబ్బరాజు, పాశం దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: వేసవితీవ్రత అధికంగా ఉండటం వలన రెండు పూటలా పనిచేయడం సాధ్యం కాదని, దానిని రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చీలి శ్రీనివాసరావు, అనిశెట్టి లక్ష్మి, పంపన అరవరాజు, ఉసుమర్తి కొండయ్య, చీలి రత్నం, మోటూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నకు అండగా నిలవాలి



నూతనంగా ఎన్నికైన పట్టణ యూత్ కమిటీతో మంత్రి కారుమూరి



తణుకులో బైక్ ర్యాలీలో పాల్గొన్న కారుమూరి సునీల్‌కుమార్

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: 2024 ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా యువత పనిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నూతనంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ పట్టణ యూత్ కమిటీ ప్రమాణ స్వీకారసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి చిన్నారులే రేపటి భావిపౌరులనే ఉద్దేశ్యంతో అందరికీ విద్యనందించి యువతకు మంచి ఉపాధి కల్పించే దిశగా జగనన్న పనిచేస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనంగా రాష్ట్రంలో చదువుల విప్లవాన్ని తీసుకువచ్చి అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద వంటి పథకాలతో పేదవర్గాల పిల్లలను అభివృద్ధి దిశగా పయనింప చేస్తున్నారని స్పష్టం చేశారు. కాబట్టి యువత అంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉండి జగనన్నకు అండగా నిలబడాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడిగా చేశెట్టి లలితా శంకర్, ఉపాధ్యక్షుడిగా కారుమంచి యోహాన్, నత్తా భానులతోపాటు 25 మంది కార్యవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు.

ఆకట్టుకున్న యువత బైక్ ర్యాలీ...

యువనేత కారుమూరి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ముందుగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సజ్జాపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు, ఎన్టీఆర్ పార్కు, మునిసిపల్ కార్యాలయం మీదుగా జెడ్పీ బాయ్స్ హైస్కూలు ప్రాంతంలోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. యువనేత కారుమూరి సునీల్ కుమార్, పార్టీ శ్రేణులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, సుద్దుల పాండు, కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దళిత వాడల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

తణుకు టౌన్: దళిత వాడల్లో రోడ్లు, డ్రైన్‌లు నిర్మించి, మంచినీటి సౌకర్యాలపై మరింత మెరుగైన సదుపాయాలు కల్పించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు కోరారు.శనివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాలును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. నన్నేటి పుష్పరాజు మాట్లాడుతూ ఎస్సీ ఏరియాల్లో శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను మరమ్మతులు చేసి కొత్త భవనాలు నిర్మించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నేటి నాగరాజు, మేడపాటి తేజ, పీతల తేజ, పమ్మి వెంకటేశ్వర్లు, ఈర్ల శ్రీను, మెంటే పండు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



అత్తిలి మండలం ఈడూరులో వెంకటేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాత సేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు జరిపి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఏడువారాల వ్రతాన్ని ఆచరించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

30 లోగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

పెంటపాడు: మే 10న జరిగే రాష్ట్ర వ్యాప్త పాలిటెక్నిక్ పాలిసెట్–23 ప్రవేశపరీక్షకు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని పెంటపాడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పరీక్ష రాసి పాసైన అభ్యర్థులు ఈ పాలిసెట్‌కు అర్హులన్నారు. వివరాలకు పెంటపాడు పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి:

పాలిసెట్–23 ప్రవేశ పరీక్ష కోసం పెంటపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఫణీంద్రప్రసాద్ తెలిపారు. పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.